ప్రజాశక్తి

ఆదివారం 2 జూన్ 2024

5

అల్లూరి సీతారామరాజు



మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు శిక్షణ

ప్రజాశక్తి-పెదబయలు : సీతగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు శిక్షణ ఇచ్చారు. మధ్యాహ్న భోజన పథకం అసిస్టెంట్ డైరెక్టర్ గిడ్డి అప్పారావు నాయుడు మాట్లాడుతూ, పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం, మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలన్నారు. రోజువారీ మెనూ విధిగా అమలు చేయాలన్నారు. ఆహారం రుచికరంగా, పరిశుభ్రంగా అందించాలన్నారు. అనంతరం నిర్వాహకులకు రోజు వారి మెనూపై వంటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన నిర్వాహకులకు బహుమతులు అందజేశారు. మండల విద్యాశాఖ అధికారి కృష్ణమూర్తి మాట్లాడుతూ, నిర్వాహకులు బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం సమన్వయ కర్త వంపూరూ వెంకటరమణ, కో ఆర్డినేటర్ ప్రవీణ్, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

సర్వం సిద్ధం



కౌంటింగ్ కేంద్రం



ఏర్పాటు చేసిన క్యూ లైన్

- మూడంచెల పటిష్ట భద్రత మధ్య కౌంటింగ్
- సిబ్బంది, ఏజెంట్లకు వేర్వేరుగా మార్గాలు
- నిఘా నీడలో కేంద్రాలు

ప్రజాశక్తి-పాడేరు: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సమయం దగ్గర పడింది. మరో రెండు రోజుల్లో రాజకీయ పార్టీల అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓట్ల లెక్కింపునకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కౌంటింగ్ రోజు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అధికారులతో సమావేశాలు నిర్వహించి ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేస్తూ భద్రతా చర్యలపై దిశా నిర్దేశం చేస్తున్నారు.



కేంద్రంలో స్టాల్

కౌంటింగ్ కేంద్రాల్లో ఐరన్ గ్రిల్స్ వేయించి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ప్రకాశవంతమైన విద్యుత్ దీపాలు, బారికేడింగ్ ఏర్పాటు చేశారు. కౌంటింగ్ అధికారులకు, సిబ్బందికి, కౌంటింగ్ ఏజెంట్లకు వేరు వేరుగా ప్రవేశ మార్గాలు ఏర్పాటు చేశారు. మీడియా సెంటరుకు రౌండ్ల వారీగా ఫలితాలు వెల్లడించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్ కేంద్రాల చుట్టూ సిసి కెమెరాలతో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశారు. డిగ్రీ కళాశాల మార్గంలో భారీ వాహనాల రవాణాను నిషేధించారు.

కౌంటింగ్ ప్రక్రియ ఇలా..

జిల్లాలో మూడు కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రమైన పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అరకు వ్యాలీ అసెంబ్లీ సెగ్మెంట్లకు పాడేరు అసెంబ్లీ సెగ్మెంట్లకు వేరు వేరు కౌంటింగ్ కేంద్రాలను, అరకు పార్లమెంటు నియోజక వర్గానికి సంబంధించి అరకు, పాడేరు నియోజక వర్గాలకు ప్రత్యేకంగా, . రంప చోడవరం నియోజక వర్గానికి రంపచోడవరం గిరిజన సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేశారు. నాలుగవ తేదీ ఉదయం ఐదు గంటలకు కౌంటింగ్ సిబ్బంది విధులకు హాజరై వారికి కేటాయించిన టేబుళ్లకు చేరుకుంటారు. ఎనిమిది గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభ మవుతుంది. ముందుగా పోస్టల్ బ్యాలెట్లను, ఇటిపిబి ఎస్ ఓట్లు లెక్కిస్తారు. అనంతరం ఇవిఎంలలో ఉన్న ఓట్లను లెక్కిస్తారు. జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారులు ప్రతి రోజూ స్ట్రాంగ్ రూంలను సందర్శించి భద్రతా చర్యలు పరిశీలిస్తున్నారు.

మూడంచెల భద్రతా చర్యలు

కౌంటింగ్ ప్రశాంతంగా జరగడానికి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తగిన భద్రతా చర్యలు చేపట్టారు. కౌంటింగ్ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతా చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. స్ట్రాంగ్ రూముల నుండి కౌంటింగ్ కేంద్రాలకు ఇవిఎంలు తరలింపు లో తీసుకోవలసిన జాగ్రత్తలపై అధికారులకు స్పష్టంగా వివరించారు. అదేవిధంగా రాజకీయ పార్టీల అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు రాకపోకలు సాగించే విధానంపై సుస్పష్టమైన సూచనలు చేశారు.

కౌంటింగ్ కేంద్రాలకు ఇలా

అరకు అసెంబ్లీ నియోజక వర్గం, పార్లమెంటు నియోజక వర్గాలకు చెందిన అభ్యర్థులు, ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బంది స్థానిక ఎంపిడిఓ కార్యాలయం జంక్షన్ నుండి వచ్చే మార్గంలో డిగ్రీ కళాశాలకు ప్రవేశం కల్పిస్తారు. పాడేరు అసెంబ్లీ నియోజక వర్గం, అరకు పార్లమెంటు నియోజకవర్గానికి చెందిన అభ్యర్థులు, ఏజెంట్లను, కౌంటింగ్ సిబ్బందిని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుండి డిగ్రీ కళాశాలకు చేరుకోవడానికి అనుమతిస్తారు. కౌంటింగ్ అధికారులు, ఏజెంట్లు, మీడియాకు జారీ చేసిన పాసులను వెంట తీసుకుని రాకపోతే అనుమతించరు. కౌంటింగ్ కేంద్రంలో కౌంటింగ్ సూపర్ వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లతో పాటు మైక్రో అబ్జర్వర్లు ఉంటారు.

తొలిసారి ఓట్ల లెక్కింపు

గత ఎన్నికలలో విశాఖపట్నం స్వర్ణ భారత స్టేడియంలో కౌంటింగ్ నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల సంబంధించి జిల్లాలో జరుగుతున్న మొట్టమొదటి ఓట్ల లెక్కింపు సజావుగా నిర్వహించి జిల్లాకు మంచి పేరు తీసుకుని రావాలని అధికారులు కృషి చేస్తున్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు పూర్తి చేశారు. అదే విధంగా విజయవంతంగా కౌంటింగ్ పూర్తి చేయడానికి పలు దఫాలుగా అభ్యర్థులు, రాజకీయ పార్టీల ఏజెంట్లతో సమావేశాలు నిర్వహించి కౌంటింగ్ ప్రక్రియపై అవగాహన కల్పించారు.

కట్టుదిట్టంగా నిర్వహించాలి : కలెక్టర్

పాడేరు: ఈ నెల 4న జరగనున్న కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో కట్టుదిట్టంగా సజావుగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం. విజయ సునీత ఆదేశించారు. రిటర్నింగ్ అధికారులు అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని, స్ట్రాంగ్ రూముల సీలు తీసిన దగ్గర నుండి ప్రతి అంశాన్ని వీడియో చిత్రీకరణ చేయాలన్నారు. శనివారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో మూడు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్, జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ,ఆయా నియోజక వర్గాలకు అందిన ఫారం 18 (కౌంటింగ్ ఏజెంట్ల నియామకం)పై ఆరా తీశారు. వారికి గుర్తింపు కార్డులను జారీ చేయాలని, ప్రతి కేటగిరీలో గుర్తు పట్టే విధంగా ప్రత్యేక డ్రెస్ కోడ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు ఎవ్వరికీ మొబైల్స్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకువెళ్ళేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ, పాడేరు, అరకు కౌంటింగ్ కేంద్రాలకు వెళ్ళాల్సిన సిబ్బంది, ఏజెంట్లు కలసుకునే అవకాశం లేదని ఎవరికి కేటాయించిన మార్గంలో వారు మాత్రమే వెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో పాడేరు, అరకు రిటర్నింగ్ అధికారులు జేసి భావన వశిష్ట, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్, వి.చైతన్య, డి.ఆర్.ఓ బి.పద్మావతి, అదనపు ఎస్పీ ధీరజ్, పాల్గొన్నారు.

ఈసారి ఇంటి వద్దకే పింఛన్లు

సచివాలయ సిబ్బంది, బ్యాంకు మిత్రల ద్వారా పంపిణీ

ఐటిడిఏ పిఒ సూరజ్ గనోరే చొరవ, చర్యలపై హర్షం

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరంల ఏజెన్సీలోని ఏడు మండలాల్లో సామాజిక పింఛన్లు లబ్ధిదారులకు ఆయా గ్రామాల్లోని సచివాలయాల సిబ్బందితో, వివిధ బ్యాంకుల బ్యాంకు మిత్రులతో ఇంటింటికి వెళ్లి అందజేసినట్లు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సూరజ్ గానోరే తెలిపారు. శనివారం సాయంకాలం తన క్యాంపు కార్యాలయం నుంచి అన్ని మండలాల ఎంపిడిఒలు, లీడ్ బ్యాంకు మేనేజర్, ఇతర బ్యాంకు మేనేజర్లతో ఇంటింటికి వెళ్లిసామాజిక పింఛన్లు పంపిణీ ఏర్పాట్లపై ప్రాజెక్ట్ అధికారి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సూరజ్ గానోరే మాట్లాడుతూ ఏజెన్సీలోని డైరెక్ట్ బ్యాంకు ట్రాన్సాక్షన్ (డిబిటి) సిస్టం ద్వారా సచివాలయాల సిబ్బందితో, వివిధ బ్యాంకుల బ్యాంకు మిత్రలతో ఇంటింటికి వెళ్లి పింఛను లబ్ధిదారులు ఇబ్బందిపడకుండా ఉదయం 6 గంటల నుండి సామాజిక పింఛన్లు పంపిణీ చేశారన్నారు. లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాల్లో జమ అయిన పింఛన్ల డబ్బులను బ్యాంకు మిత్రలు వారి ఇంటికి వెళ్లి డ్రాచేసి నగదును అందజేశారన్నారు.

రంపచోడవరం మండలంలో 929 పింఛన్లకు గాను 750 మందికి, రాజవొమ్మంగి మండలంలో 1309 పింఛన్లుగాను 950 మందికి, అడ్డతీగలలో1059 పింఛన్లకు గాను 757 మందికి, దేవీపట్నంలోని 968 పింఛన్లుగాను 669 మందికి, గంగవరం మండలంలోని 857 పింఛన్లకు గాను 578 మందికి, వై.రామవరం మండలంలోని 641 పింఛన్లకుగాను 410 మందికి, మారేడుమిల్లి మండలంలోని 459 పింఛన్లకు గాను 271 మందికి మొత్తంగా 6222 పింఛన్లకు గాను 4385 మంది పింఛనుదారులకు ఇంటింటికీ వెళ్లి అందజేసినట్లు తెలిపారు. జూన్ ఒకటో తేదీన 70.47 శాతం పింఛన్లు పంపిణీ చేశామని పిఒ వెల్లడించారు. జూమ్ కాన్ఫరెన్స్‌లో లీడ్ బ్యాంక్ మేనేజర్ రవితేజ, వెలుగు ఎపిడి శ్రీనివాసరావు, ఎంపిడిఒలు హరికృష్ణ, వీరకిషోర్ బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత



రోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ సౌమ్య

ప్రజాశక్తి -సీలేరు: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ సౌమ్య సూచించారు శనివారం దుప్పిలివాడ పంచాయతీ గెడ్డవలస, గెడ్డ కొత్తూరు, శాండు కోరి గ్రామాల్లో సీలేరు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సౌమ్య ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం గిరిజనులతో సమావేశమై సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం వడగాల్పులు, అధిక ఉష్ణోగ్రతల వలన డయేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు తినరాదని, తాజా, అప్పటికప్పుడు తయారు చేసుకున్న ఆహార పదార్థాలు భుజించాలని సూచించారు. ఎవరికైనా ఆరోగ్యం బాగోలేకపోతే వెంటనే పిహెచ్‌సి సందర్శించి తగు వైద్యసేవలు పొందాలన్నారు. ద్రవరూపంలో ఉన్న పదార్థాల్ని తీసుకుంటే ఆరోగ్యపరంగా మంచిదన్నారు. రానున్న రోజుల్లో వర్షాల సీజన్ ప్రారంభం కానున్నందు ముందస్తుగానే ఇంటి పరిసరాల్లో మురికి గుంతల్లోని చెత్తాచెదారాలను తొలగించి పరిశుభ్రం చేసుకోవాలన్నారు. మురుగునీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెంది, పారిశుధ్యం క్షీణించి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని వివరించారు.కార్యక్రమంలో హెచ్‌ఎస్ త్రినాథ్, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలల్లో అదనంగా సీట్లు పెంచాలి

- మహిళా జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి
- అందరికీ ఇంటర్ అడ్మిషన్స్ కల్పించాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స

ప్రజాశక్తి-పాడేరు: గిరిజన గురుకుల కళాశాలల్లో ఇంటర్ అడ్మిషన్ కోసం అదనపు సీట్లు పెంచి ప్రవేశాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనరస డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఈ విషయంపై స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు జిల్లాలో గురుకుల ఇంటర్ కళాశాల అడ్మిషన్ కోసం 2,400 మందికి పైబడి దరఖాస్తు చేసుకున్నా ఆదివాసీ విద్యార్థినులకు కేవలం 450 మందికి మాత్రమే అడ్మిషన్ కల్పించారన్నారు. గతంలో అరకు, జి.కె వీధి, పాడేరులో ఉన్న గ్రూపులకు 200 సీట్లు పెంచారని, ఈ ఏడాది మాత్రం అడ్మిషన్‌లో అదనపు సీట్ల కేటాయింపుపై నేటికీ ప్రభుత్వానికి ప్రతిపాదించలేదన్నారు. జిల్లాలో మహిళా అక్షరాస్యత తక్కువగా ఉందని ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన ఆదివాసీ విద్యార్థినులకు అడ్మిషన్ ఇవ్వడంలో ఆంక్షలు విధించడం దారుణమన్నారు. దరఖాస్తు చేసుకున్న ఆదివాసీ విద్యార్థినులకు అడ్మిషన్ ఇవ్వాలని, ముంచంగిపుట్ ఏరియాలో గిరిజన గురుకులం బాలికల ఇంటర్ కళాశాల ఏర్పాటు చేసి అడ్మిషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స



మాట్లాడుతున్న ఎంపిపి నీలవేణి

రోడ్డు ఏర్పాటుతో నష్టంపై అధికారులకు తెలియజేస్తాం : ఎంపిపి

ప్రజాశక్తి-అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన తాడిగుడ జలపాతానికి 45 అడుగుల మేర రోడ్డు విస్తీర్ణంతో వైయస్సార్ కాలనీ, పెద్దుఉరు గ్రామాలకు నష్టంపై సంబంధిత ఉన్నత అధికారులకు విన్నవిస్తానని స్థానిక ఎంపీపీ శెట్టి నీలవేణి స్పష్టం చేశారు గ్రామాలలో శనివారం సందర్శించిన ఆమె మాట్లాడుతూ, గ్రామాల మీదుగా రోడ్డు విస్తరణకు అధికారులు కొలతలు వేసి ఇల్లు, కిరాణా దుకాణాల తొలగించాలని నోటీసులు అందజేశారన్నారు. దీనిపై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ప్రత్యామ్నాయ మార్గం కోసం కృషి చేస్తానని ఆమె అన్నారు. గ్రామ సభ ఏర్పాటు చేసి స్థానిక ప్రజల అభిప్రాయాల మేరకే రోడ్డు పనులు ముందుకు కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మాజీ మండల అధ్యక్షులు శెట్టి ఆనంద్, గ్రామ పెద్దలు దొనేష్, రమేష్ నాయుడు, ప్రసాద్, మహదేవ్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

ప్రజాశక్తి-అనంతగిరి: గిరిజన ప్రజలు వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించావల్సిన అవసరం ఎంతైనా ఉందని అనంతగిరి ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారిణి జ్ఞానేశ్వరి సూచించరు. శనివారం స్దానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ, ఎపిడమిక్ సీజన్, మరోపక్క ఎండల ఉక్కపోత, రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో తాగునీరు కలుషితవుతుందన్నారు. ఈ సీజన్ కాలంలో లభించే మామిడి, పనస, పళ్ళు తినేటప్పుడు వాటిని పలుమార్లు శుభ్రపరిచి తినాలని సూచించారు. కాచి వడబోసిన నీటినే తాగాలని, పాడైన మాంసం వంటి ఆహార పదార్థాలు తినరాదన్నారు.



లక్ష్మణరావు దంపతులను సన్మానిస్తున్న సిఐ

లక్ష్మణరావు దంపతులకు సత్కారం

ప్రజాశక్తి-హుకుంపేట: స్థానిక పోలీస్ స్టేషన్లో ఉద్యోగ విరమణ పొందిన అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ కోరమ లక్ష్మణరావు దంపతులకు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వీడ్కోలు సభను పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. పాడేరు సిఐ సన్యాసినాయుడు మాట్లాడుతూ, ఉద్యోగం పట్ల నిబద్ధతతో లక్ష్మణరావు పని చేశారన్నారు. ఆయా పోలీస్ స్టేషన్లో 35సంవత్సరాలు సర్వీస్ అందించడం గొప్ప విషయమన్నారు. ఎటువంటి రిమార్కు లేకుండా నిజాయితీగా విధులు నిర్వహించిన లక్ష్మణరావుకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.స్థానిక ఎస్సై సతీష్ మాట్లాడుతూ, సార్వత్రిక ఎన్నికల్లో లక్ష్మణరావు కీలకంగా విధులు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖ సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓట్ల లెక్కింపు చేపట్టాలి

రంపచోడవరం రిటర్నింగ్ అధికారి, ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి- రంపచోడవరం : ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుందని రంపచోడవరం అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సూరజ్ గానోరే స్పష్టం చేశారు. శనివారం స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో అన్ని మండలాల తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, ఎంఆర్‌ఐలు, సీనియర్ అసిస్టెంట్లు, గ్రామ సచివాలయాల సర్వేయర్లతో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు విధులపై సమీక్షించారు. ఈ సందర్భంగా పిఒ సూరజ్ గానోరే మాట్లాడుతూ రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 399 పోలింగ్ కేంద్రాల ఓట్ల లెక్కింపునకు పార్లమెంటుకు, అసెంబ్లీకి వేర్వేరుగా చెరో 20 టేబుల్స్ ఏర్పాటు చేశామన్నారు. ఒక్కొక్క టేబుల్‌కు నలుగురు కౌంటింగ్ సిబ్బంది ఉంటారన్నారు. ఓట్ల లెక్కింపు రోజున ఉదయం స్ట్రాంగ్ రూముల నుండి ఓట్ల లెక్కింపు కేంద్రానికి ఇవిఎంలు, వివి.ప్యాడ్‌లు తీసుకురావడం దగ్గర నుంచి ఓట్ల కౌంటింగ్ వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సూరజ్‌గనోరే

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు నిర్వహణ, ప్రతి రౌండ్‌కు డేటా ఎంట్రీ నమోదు ఎన్నికల సంఘం నిబంధనలు మేరకు జరగాలన్నారు. దీనికి సంబంధించి వివిధ ఫారాల నిర్వహణపై ఇన్‌ఛార్జిలను అడిగి తెలుసుకున్నారు. ఓట్ల లెక్కింపు రోజున ఆయా ఇన్‌ఛార్జిలు, ఇతర అధికారులు, సిబ్బంది ఒకటికి రెండుసార్లు పరిశీలించి, నిర్ధారణ చేసుకున్నాకే కౌంటింగ్ విధులు నిర్వహించాలన్నారు. అనంతరం వివి ప్యాడ్లు, ఇవిఎంలు, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కింపు తర్వాత ఏ విధంగా భద్రపరచాలి, ఏవిధంగా సీలు వేయాలి, ఏయే ఫారాలలో వివరాలను ఎలా నింపాలో వివరించారు.

ఓట్ల లెక్కింపు సజావుగా ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుటకు అందరం కలిసికట్టుగా ఎటువంటి ఇబ్బందులకు తావు లేకుండా పనిచేయాలని సూచించారు. కౌంటింగ్ విధులపై పూర్తి అవగాహనతో ఉండాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల హెల్ప్ డెస్క్ విధుల నిర్వహణపై సూచనలు చేశారు. కౌంటింగ్‌కు సంబంధించి ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే తెలియపరచాలన్నారు. సమావేశంలో తహశీల్దార్లు ఎవి.రమణ, దీవి సత్యనారాయణ, నాగరాజు, సత్య సులోచన, చలపతిరావు, డిటిలు బి.రాజు, త్రిమూర్తులు, సుధాకర్ బాబు, శివ, చైతన్య, సత్యనారాయణ, సరిత, విశ్వనాథ్, శ్రీధర్, బాలాజీ, రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కోర్సులో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -రంపచోడవరం : ఆచార్య ఎన్‌జిరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహించే వ్యవసాయ డిప్లమా కోర్సుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు రంపచోడవరం పాలిటెక్నిక్ ఆఫ్ అగ్రికల్చర్ కాలేజీ ప్రిన్సిపల్ డి సుధాకర్ తెలిపారు. ఈ కోర్స్‌లో ప్రవేశానికి దరఖాస్తుకు పదవ తరగతి ఉత్తీర్ణత, ఇంటర్ ఫెయిలైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. 2023 ఆగస్టు 31 నాటికి 15 నుండి 22 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉండాలని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చదివిన విద్యార్థులకు 75 : 25 నిష్పత్తిలో సీట్లు కేటాయింపు ఉంటుందన్నారు.ఈనెల 20లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయం www.angrau.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్న ఏకైక పాలిటెక్నిక్ అగ్రికల్చర్ కాలేజీలో 2013 నుంచి రెండేళ్ల అగ్రికల్చర్ డిప్లమో కోర్సు అందుబాటులో ఉందన్నారు. గత సంవత్సరం నలుగురు స్థానిక కాలేజీ విద్యార్థులు అగ్రిసెట్‌లో ర్యాంకులు సాధించారన్నారు. ఈ అగ్రికల్చర్ డిప్లొమా కోర్సులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయని, రెండవ సంవత్సరం మొదటి సెమిస్టర్ పిఎంపి ద్వారా విద్యార్థులకు నేరుగా వ్యవసాయ విధానాలు, వ్యవసాయ వ్యాపారాలు, ఇతర నైపుణ్యతలను అభ్యసిస్తారన్నారు. స్థానికులు ఎవరైనా సందేహాలుంటే రంపచోడవరం పాలిటెక్నిక్ ఆఫ్ అగ్రికల్చర్ కళాశాల వేళల్లో నేరుగా సంప్రదించవచ్చని, మరిన్ని వివరాలకు 8247848525 నెంబర్ ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చునని సూచించారు.

స్వచ్ఛందంగా ఆక్రమణల తొలగింపు



రోడ్డు పక్క అక్రమ కట్టడాలు తొలగిస్తున్న షాప్ యజమానులు

ప్రజాశక్తి -మారేడుమిల్లి: మారేడుమిల్లి గ్రామ ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న అక్రమ కట్టడాలను వాటి యజమానులు స్వచ్ఛందంగా తొలగిస్తున్నారు. గత నెల రెవెన్యూ, ఆర్‌అండ్‌బి, పంచాయతీ సిబ్బంది కలిసి మారేడుమిల్లి గ్రామ ప్రధాన రహదారికి ఇరువైపుల ఉన్న అక్రమ నిర్మాణదారులకు నోటీసులిచ్చారు. మండలంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి చేపట్టిన అక్రమ నిర్మాణాలను రెండు రోజుల క్రితం నుండి తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి రాజకీయ నాయకుల పైరవీలు పనిచేయడం లేదని ప్రజలు బాహాటంగానే చెప్పుకుంటున్నారు. ఇప్పటికైనా మారేడుమిల్లి గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు తొలగిస్తుండడంతో ట్రాఫిక్ కష్టాలు తొలగడంతోపాటు పర్యాటకంగా లాభిస్తుందని స్థానికులు అంటున్నారు. అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపిన ఐటిడిఎ పిఒ, రెవెన్యూ, ఆర్‌అండ్‌బి, పంచాయతీ అధికారులకు స్థానికులు ధన్యవాదాలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి -సీలేరు: సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పిన్సిపల్ వి. శంకరరావు వెల్లడించారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ఆసక్తిగల విద్యార్థులు 10 పాస్ సర్టిఫికేట్లు తీసుకొని వస్తే వెంటనే అడ్మిషన్లు పొందవచ్చున్నారు. దూర ప్రాంత విద్యార్థులకు హాస్టల్ వసతి సౌకర్యాలు పొందవచ్చునన్నారు. విద్యార్థులకు డిజిటల్ క్లాసులు, కంప్యూటర్ శిక్షణ సీనియర్ ఫ్యాకల్టీ కామర్స్ లెక్చరర్ శ్రీనివాస్ నుంచి శిక్షణ పొందవచ్చని ప్రిన్సిపాల్ తెలిపారు. జాతీయ సేవా పథకం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ, క్రీడల్లోనూ తర్ఫీదు ఇస్తామన్నారు. క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామన్నారు.

ఏకలవ్య ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

15లోగా ఆరో తరగతిలో ప్రవేశానికి అవకాశం

ప్రజాశక్తి -మారేడుమిల్లి : స్థానిక మారేడుమిల్లి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాలు వెల్లడించారు.. ఎంపికైన విద్యార్థుల వివరాలను మారేడుమిల్లి ఏకలవ్య పాఠశాల నోటీస్ బోర్డులో ఉంచినట్లు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపల్ టి.అరుణకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఈనెల 5 నుంచి 15వతేదీలోగా ఏకలవ్య పాఠశాలలో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ఆన్‌లైన్ మార్కుల జాబితాతోపాటు అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో పాఠశాలను సందర్శించి, ప్రవేశాలను పొందాలని సూచించారు.



మారేడుమిల్లి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల

ఎండ తీవ్రత తట్టుకోలేక వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి- విఆర్.పురం:రెండు రోజులుగా మండలంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఎండ దెబ్బకు తట్టుకోలేక పలువురు అస్వస్థతకు. గురవుతున్నారు. ఈ క్రమంలో మండలంలోని శ్రీరామగిరి గ్రామానికి చెందిన పిట్ల నాగమ్మ (82) అనే వృద్ధురాలు ఇంటి వద్ద ఉన్నప్పటికీ, మూడు రోజులుగా కొంత అనారోగ్యంగా ఉండడం, రెండురోజులుగా వడగాలులు, ఎండల తీవ్రత ఎక్కువ కావడంతో వాటిని తట్టుకోలేక శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలు నాగమ్మకు ఒక కొడుకు, ఐదుగురు కుమార్తెతులు ఉన్నారు. శనివారం గ్రామంలో బంధువులు, కుటుంబసభ్యులు దహన సంస్కారాలు నిర్వహించారు.



నాగమ్మ (ఫైల్ ఫొటో)

వరి విత్తనాలు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-అరకులోయరూరల్: మండలంలోని పద్మాపురం పంచాయతీ పరిధిలో ఉన్న రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేయాలని ఉప సర్పంచ్ జె.భగత్ రామ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ప్రతి పంచాయతీ కేంద్రంలో రైతు భరోసా కేంద్రాలు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, ఆయా కేంద్రాల్లో రైతులకు వరి విత్తనాలు సబ్సిడీతో ఇవ్వాలన్నారు. వ్యవసాయ సీజన్ వచ్చిందని, దీంతో రైతులు విజయనగరం, ఒడిశా ప్రాంతాలకు వెళ్లి వరి విత్తనాలు తెచ్చుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. అవి నకిలీ విత్తనాలు కావడంతో రైతులు తీవ్రంగా మోసపోతున్నారని తెలిపారు.

ముగిసిన రగ్బీ పోటీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాల్గో వార్డు తిమ్మాపురం విజ్ఞాన్ ఇంటర్నేషనల్ స్కూల్ క్రీడా మైదానంలో ఈ నెల 31న ప్రారంభమైన రాష్ట్ర స్థాయి రగ్బీ జూనియర్ బాల బాలికల ఛాంపియన్ షిప్ పోటీలు శనివారంతో ముగిశాయి. 9వ రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు 13 జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. బాలికల విభాగంలో అనంతపురం, బాలుర విభాగంలో నెల్లూరు జట్లు ఛాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నట్లు ఎపి రగ్బీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లలిత్ కుమార్, కిషోర్ కుమార్ తెలిపారు.

బాలుర విభాగంలో నెల్లూరు, కర్నూలు, తూర్పు గోదావరి జిల్లా జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. బాలికల విభాగంలో అనంతపురం, గుంటూరు, తూర్పు గోదావరి జట్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. విజ్ఞాన్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపల్ చైతన్య, వేదాంత సంస్థ వ్యవస్థాపకులు రాజశేఖర్, ప్రకృతి విద్యా సంస్థల అధిపతి శ్రీనివాసులు విజేతలకు ట్రోఫీలు, పతకాలు అందజేసి అభినందించారు.

కేంద్ర కారాగారానికి డిజిటల్ హెల్త్ ఎటిఎం వితరణ

ప్రజాశక్తి - ఆరిలోవ : కేంద్రకారాగారంలో ఖైదీ ఆరోగ్య పరీక్షల కోసం సింబయాసిస్ టెక్నాలజీస్ డైరెక్టర్ డాక్టర్ నరేష్ కుమార్, జెమ్ ఓపెన్ క్యూబ్ టెక్నాలజిస్ ప్రయివేటు లిమిటెడ్ హైదరాబాద్ సిఇఒ డాక్టర్ వినోద్‌కుమార్, విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ టెక్నాలజీ డైరెక్టర్ మధుసూధనరావు ఆర్థిక సాయంతో ప్రణామ్స్ హాస్పిటల్, జెమ్ ఓపెన్ క్యూబ్ టెక్నాలజీస్ వారిచే తయారుచేసిన డిజిటల్ హెల్త్ ఎటిఎం మెషిన్‌ను విశాఖ కేంద్రకారాగారానికి వితరణగా అందజేశారు. విశాఖ కేంద్రకారాగారంలో ఆంధ్రప్రదేశ్ జైళ్ల శాఖ ఐజి డాక్టర్ ఇండ్ల శ్రీనివాసరావుకు ఈ డిజిటిల్ హెల్త్ ఎటిఎం మిషన్‌ను శనివారం అందజేశారు. ఈ ఏటిఎం మిషన్ ద్వారా 75 హెల్త్ చెక్ అప్ ఫలితాలు రెండు నుంచి మూడు నిమిషాలలో పూర్తి ఖచ్చితత్వంతో రిపోర్టు తెలుసుకోవచ్చని ఐజి ఇండ్ల శ్రీనివాసరావు తెలిపారు. ఈ పరికరం సేవలు త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కేంద్రకారాగారం పర్యవేక్షణాధికారి ఎస్.కిషోర్‌కుమార్, అదనపు పర్యవేక్షణాధికారి ఎం.వెంకటేశ్వర్లు, జైలు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉడా లే-అవుట్ల స్థలాలకు డ్రా

ప్రజాశక్తి- లీగల్ : విశాఖపట్నం సిటీ అడ్వకేట్స్ మ్యూచువల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యాన ఉడా లే-అవుట్ స్థలాల డ్రా శనివారం న్యాయవాదుల సంఘం గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ హాజరై న్యాయవాదులకు స్థలాలు ఏర్పాటుచేసిన సొసైటీని అభినందించారు. బ్యాంకు ఉద్యోగుల, డాక్టర్లు... ఇలా అనేక వృత్తిపరమైన కాలనీలు ఉంటున్నాయని, అదేవిధంగా ఈ సొసైటీ ద్వారా న్యాయవాదుల కాలనీలు ఏర్పాటుచేయడం మంచి పరిణామం అన్నారు. సభకు అధ్యక్షత వహించిన సొసైటీ ప్రధాన కార్యదర్శి మొక్కలపుక్కల నాగరాజు ఆధ్వర్యాన 80 మంది సభ్యులకు సైట్లను డ్రా ద్వారా కేటాయించారు. ఈ లే-అవుట్‌ని అభివృద్ధి చేస్తామని సభ్యులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డైరెక్టర్లు నూకల వెంకటేశ్వరరావు, కోడి శ్రీనివాసరావు, జెవివి రాఘవేంద్రరావు, న్యాయవాదుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బెవర సత్యనారాయణ, దంతా నరేష్ కుమార్, బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ ఎస్.కృష్ణమోహన్, మెంబర్లు కె.రామజోగేశ్వరరావు, పి.నర్సింగరావు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి -గాజువాక : జెఎస్ ఫర్ పీపుల్ ఫౌండేషన్ ఫౌండర్ జాగరపు శ్రీను ఆధ్వర్యాన దల్లివానిపాలెంలో శనివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జాగరపు శ్రీను మాట్లాడుతూ, ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత 15 సంవత్సరాల నుంచి గాజువాక పరిసర ప్రాంతాల్లో ఎక్కడో ఒక దగ్గర చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

మూడేళ్లు కావస్తున్నా...

పిల్లర్ల దశలోనే కొర్రాయి వంతెన

రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్న గిరిజనులు




పిల్లర్ల దశలోనే నిలిచిన వంతెన పనులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: "దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న చందంగా" ఆంధ్ర ఒడిస్సా కనెక్టివిటీ కొల్లాపుట్టు రోడ్డు గత్తర జిల్లేడ వంతెన పరిస్థితి తయారైంది. వంతెన నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ నిర్మాణంలో సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో సుమారు మూడేళ్లకు పైగా గడుస్తున్నా ఇప్పటికీ ఆ వంతెన నిర్మాణం పనులు పూర్తి కాలేదు. అసంపూర్తిగా ఉండటంతో వర్షాకాలంలో గిరిజనులకు రవాణా కష్టాలు తప్పడం లేదు. వర్షాకాలంలో గెడ్డ పొంగి ప్రవహిస్తుండటంతో ఆ ప్రాంత గిరిజనులు రవాణా సౌకర్యానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మండలంలోని కొర్రాయి రోడ్డు కొర్రాయి సమీపంలోని గత్తర జిల్లేడ గెడ్డ వద్ద వంతెన నిర్మాణానికి సుమారు గత మూడేళ్ల క్రితం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో, అప్పట్లో పనులు ప్రారంభించి పిల్లర్స్ దశ వరకు రాడ్లు నిర్మించి అసంపూర్తిగా వదిలేశారు. వర్షాలు కురిసినప్పుడు గెడ్డ నీరు పొంగి ప్రవహిస్తుండటంతో ఆ ప్రాంత గిరిజనులకు రాకపోకలు స్తంభించి పోతున్నాయి. ఈ రోడ్డుకు ఆనుకుని కొర్రాయి, కొల్లాపుట్టు పంచాయతీ పరిధిలోని సుమారు 42 గ్రామాలతో పాటు ఒడిశాకు కూడా వెళ్ళవచ్చు. ఈ రోడ్డు మీదుగా ఒడిస్సాలోని పొట్టంగి, పుక్కలి, కొరపుట్, సిమిలిగూడతో పాటు సుంకి మీదుగా ఆంధ్రకు చెందిన సాలూరు ప్రాంతానికి కూడా ప్రయాణించవచ్చు. దీంతో, ఆ ప్రాంతానికి చెందిన వారు ఈ రోడ్డు కూడా ప్రయాణాలు ఎప్పటికప్పుడు సాగిస్తుంటారు. దీంతో పాటు కొల్లాపుట్టులో జలతరంగిణి పర్యాటక కేంద్రం ఉండటంతో పర్యాటకులు కూడా ఈ రోడ్డు గుండానే పర్యటించి సందర్శిస్తున్నారు. వంతెన అసంపూర్తిగా నిర్మించి వదిలేయడంతో వాహనదారులు, పర్యాటకులు, ఆ ప్రాంత గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. అనారోగ్యాలకు గురయ్యే వ్యాధిగ్రస్తులను అత్యవసర పరిస్థితిలో హాస్పిటల్‌కు తరలించాలంటే వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో గెడ్డ నీరు పొంగి ప్రవహిస్తుంది. దీనికితోడు వంతెన నిర్మాణానికి మట్టి తీసి ఉండటంతో రోడ్డంతా బురదమయంగా మారింది. దీంతో, ద్విచక్ర వాహన చక్రాలు జారి పోతుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న వంతెనను పూర్తిగా నిర్మించి, రవాణా కష్టాలు తీర్చాలని ఆ ప్రాంత గిరిజనులు కోరుతున్నారు.

కారాగారాల్లో సంస్కరణల అమలుకు కమిటీలు

జైళ్ల శాఖ ఐజి డాక్టర్ ఇండ్ల శ్రీనివాసరావు



విలేకర్లతో మాట్లాడుతున్న ఇండ్ల శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఆరిలోవ : దేశంలో కారాగారాల ఆధునీకరణ, పటిష్ట సంస్కరణలు అమలు, అభివృద్ధి, జైలు ఉద్యోగులకు పటిష్టమైన శిక్షణ తదితర వాటికోసం కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో ప్రత్యేక కమిటీలు నియమించిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జైళ్ల శాఖ ఐజి డాక్టర్ ఇండ్ల శ్రీనివాసరావు తెలిపారు. విశాఖ కేంద్రకారాగారాన్ని సందర్శించిన ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. జాతీయ స్థాయిలో జైళ్ల ఆధునీకరణ, సంస్కరణల అమలు కోసం కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన బ్యూరో ఆఫ్ ప్రిజన్స్ అండ్ పోలీస్ రీకనస్ట్రక్షన్ డెవలప్‌మెంట్ (బిపిఆర్‌డి) ఆధ్వర్యాన ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రెండు జాతీయ కమిటీలకు తనను చైర్మన్‌గా నియమించారని చెప్పారు. ఈ కమిటీలు దేశవ్యాప్తంగా ఉన్న జైళ్లను పరిశీలించి వాటికి అనుకూలమైన వ్యవహారాలకు సంబంధించిన నివేదికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ప్రస్తుతం సుమారు నెల రోజులుగా ఈ కమిటీలు పనిచేస్తున్నట్టు తెలిపారు. ఈ కమిటీల ద్వారా దేశంలో ఎక్కడైనా కొత్తగా జైలు ఏర్పాటు చేయాలంటే ఎలాంటి స్థలంలో జైలును నిర్మించాలి, జైలు నిర్మాణానికి అనుకూలమైన వాతావారణం ఉంది, వాతావరణానికి తగ్గట్టు ఎలాంటి సౌకర్యాలు, మౌలిక వతసతులు ఉండాలి, గ్రీనరీ ఏవిధంగా ఉండాలి, ఎలాంటి రక్షణ గోడలు ఉండాలి, జైలుకు వేసే రంగులు తదితర వాటి గురించి 50 సంవత్సరాలు జీవిత కాలం ప్రామాణికంగా చేసుకొని నివేదిక సిద్ధం చేసి కేంద్రక హోం శాఖకు నివేదిక సమర్పించాల్సి ఉంటుందన్నారు.

ప్రతిభ ఉన్న వారికే గుర్తింపు

ఎసిఎ కార్యదర్శి ఎస్ఆర్.గోపినాథ్ రెడ్డి

ప్రజాశక్తి -పిఎం పాలెం : ప్రతిభ ఉన్న వారికే గుర్తింపు ఉంటుందని ఎసిఎ కార్యదర్శి ఎస్ఆర్.గోపినాథ్‌రెడ్డి వెల్లడించారు. క్రికెట్‌లో క్రమశిక్షణ ఎంతో అవసరం అన్నారు. విడిసిఎ ఆధ్వర్యాన నిర్వహించిన సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంపు ముగింపు సమావేశం శనివారం డాక్టర్ వైఎస్ఆర్ ఎసిఎ- విడిసిఎ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గోపినాథ్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రతిభ కలిగి గుర్తింపులేని క్రికెటర్లకు రైజింగ్ స్టార్స్ పేరుతో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఇటీవల ఒక చక్కటి వేదికను కల్పించామని తెలిపారు. దీంతో ఎసిఎ విడుదల చేసిన వేలం అర్హత జాబితాలో లేని ఆటగాళ్లకు ట్రయల్స్ నిర్వహించి ప్రతిభ చూపిన ఏడుగురికి ఎపిఎల్ - 3 వేలంలో స్థానం కల్పించినట్లు పేర్కొన్నారు. ప్రతి క్రీడాకారుడి గణాంకాలతో కూడిన పూర్తి సమాచారాన్ని నిక్షిప్తం చేసేందుకు వీలుగా ఈసారి సరికొత్త సాఫ్ట్ వేర్‌ను వినియోగిస్తున్నట్లు తెలిపారు. అనంతరం క్రీడాకారులకు సర్టిఫికెట్లు, కోచ్‌లకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఎసిఎ గేమ్ డెవలప్‌మెంట్ జనరల్ మేనేజర్ ఎంఎస్.కుమార్, విడిసిఎ అధ్యక్ష, కార్యదర్శులు పి.విష్ణుకుమార్‌రాజు, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌పిసిఎల్ సిఎమ్‌డికి ఏయూ డాక్టరేట్

ప్రజాశక్తి-విశాఖపట్నం : హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ సిఎమ్‌డి పుష్పకుమార్ జోషికి ఏయూ డాక్టరేట్ లభించింది. ఏయూ హ్యూమన్ రిసోర్సెస్ విభాగం నుంచి 'అక్షయపథ్- ఏ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ఇనీషియేటివ్ త్రూ ఎమోషనల్ అండ్ సోషల్ ఇంటిలిజెన్స్ కాంపిటెన్సీస్, ఏ కేస్ స్టడీ ఇన్ హెచ్‌పిసిఎల్' అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. శనివారం ఏయూ వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను పుష్పకుమార్ జోషి స్వీకరించారు. అనంతరం ఏయూ వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఏయూ నిర్వహిస్తున్న స్టార్టప్ ఇంక్యుబేషన్‌తో అనుసంధానం అవడం, ఏయూ అభివృద్ధిలో భాగం అవుతామని పుష్పకుమార్ జోషి తెలిపారు. ఏయూలో విభిన్న అంశాలలో సాధిస్తున్న ప్రగతిని వీసీ ప్రసాదరెడ్డి వివరించారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన వీసీ

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం డిగ్రీ ఫలితాలలో ప్రతిభ చూపిన విద్యార్థులను వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. సత్య డిగ్రీ కళాశాలకు చెందిన బిబిఎ విద్యార్థిని కొమ్మురు రమ్య యూనివర్సిటీ టాపర్‌గా నిలచింది. కళాశాల విద్యార్థినులు కె.రమ్య, టి.ఊర్మిళ విజయనగరం జిల్లాలో ప్రథములుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్, సత్య గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవి.సాయి దేవమణి, విభాగాధిపతి ఎస్.వరూధిని పాల్గొన్నారు.

జై జవాన్ ఫౌండేషన్ ఆర్థిక సహాయం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం జై జవాన్ ఫౌండేషన్ ఆధ్వర్యాన కేన్సర్ బాధితులకు ఆర్థిక సాయం అందజేశారు. విజయనగరం జిల్లా సవరవల్లి గ్రామానికి చెందిన బాడితబోయిన సాయి గణేష్ (5) ఒక సంవత్సర కాలంగా కేన్సర్ వ్యాధితో బాధపడుతూ విశాఖపట్నంలోని ఒమేగా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. తల్లిదండ్రులు బాడితబోయిన రాంబాబు, సన్యాసమ్మది నిరుపేద కుటుంబం కావడంతో ఆనందపురం గ్రామంలో ఉన్న జై జవాన్ ఫౌండేషన్‌ను సాయం కోరగా సభ్యులు స్పందించి ఫేస్‌బుక్ వాట్సప్ ద్వారా అబ్బాయికి సంబంధించిన పోస్టులు చేసి ఫోన్ పే ద్వారా రూ.28 వేలు స్వీకరించారు. ఆనందపురం జడ్‌పిహెచ్ స్కూల్ 2007 బ్యాచ్ తరుపున కోటేశ్వరరావు రూ.5 వేలు, 416 బ్యాచ్ సిఆర్‌పిఎఫ్ జవాన్లు రూ.5వేలు సహాయం చేశారు. జై జవాన్ ఫౌండేషన్ ద్వారా హాస్పిటల్లో రోగి తల్లిదండ్రులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు కుప్ప రాజశేఖర్, వైస్ ప్రెసిడెంట్ ముడసల శ్రీను, సెక్రటరీ ముడసల కార్తీక్, జనరల్ సెక్రటరీ ఇమంది శ్రీనివాసరావు, కోశాధికారి కుప్ప రామలక్ష్మి, కుప్ప శ్రీను, కుప్ప అప్పారావు, శ్రీను, చిరంజీవి, రాము, గణేష్, ఆనంద్, రాజు, వంశీ, బంగార్రాజు పాల్గొన్నారు.

11 మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని ఆర్.తాళ్లవలసలో అదే గ్రామానికి చెందిన శ్రీను నుంచి 180 మిల్లీ లీటర్ల 11 మద్యం బాటిళ్లను ఎస్ఇబి పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యం బాటిళ్లు కలిగి ఉన్నందున శ్రీనుపై కేసు నమోదు చేసినట్లు సిఐ వి.రామకృష్ణ తెలిపారు.



ప్రచారం చేపడుతున్న సిఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ మోహన్‌కుమార్

నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు

ప్రజాశక్తి- రంపచోడవరం : ఎన్నికల కౌంటింగ్ రోజున రంపచోడవరంలో సిఆర్‌పిసి 144 సెక్షన్ అమలులో ఉంటుందని సర్కిల్ ఇన్స్పెక్టర్ వి వెంకటేశ్వరరావు తెలిపారు. ఎవరూ గుంపులుగా తిరగకూడదని, విజయోత్సవ ఊరేగింపులు, ర్యాలీల నిర్వహణ, బాణాసంచా కాల్చటానికి ఎటువంటి అనుమతులు లేవన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు స్థానిక పోలీసులు రంపచోడవరం, పరిసర ప్రాంతాలలో ఆటోలో మైక్ ద్వారా ప్రచారం చేస్తున్నారు. కార్యక్రమంలో రంపచోడవరం ఎస్ఐ మోహన్ కుమార్ పాల్గొన్నారు.

వచ్చిపోయే విద్యుత్‌తో అవస్థలు

- వారం రోజులుగా వినియోగదారుల అగచాట్లు

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ పరిధి గ్రామాలకు వారం రోజులుగా విద్యుత్ సరఫరాల సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులు గురవుతున్నారు. అసలే వేసవికాలం కాలం కావడంతో ఒకపక్క ఎండలు భగభగ, మరోపక్క విద్యుత్తు సరఫరాలో అంతరాయంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దారకొండలోని విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి దారకొండ, కమ్మరి తోట, దారకొండ కాలనీ, తోట నగరం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా జరుగుతుంది. తరచూ వచ్చిపోయే విద్యుత్‌తో నానా అవస్థలు పడుతున్నామని వినియోగదారులు వాపోతున్నారు. సమీపంలో అటవీప్రాంతం ఉండడంతో రాత్రి సమయంలో విష కీటకాల వల్ల ఎటువంటి ప్రమాదం జరుగుతుందని భయాందోళనతో బిక్కుబిక్కుమంటున్నారు. దీనిపై విద్యుత్‌శాఖ అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, విద్యుత్ సరఫరాను క్రమబద్ధీకరించాలని కోరుతున్నారు.

ఐఐఎఫ్‌ఎల్ బాండ్ల ద్వారా రూ.వెయ్యి కోట్ల సేకరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దేశంలో నాన్ బ్యాంకింగ్ మైక్రో ఫైనాన్స్ సంస్థ ఐఐఎఫ్ఎల్ బాండ్ల ద్వారా రూ.1000 కోట్లు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు సంస్థ ఫైనాన్స్ సిఇఒ వెంకటేష్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. మూలధన వృద్ధి, వ్యాపార ఎదుగుదలకు ఇది దోహదపడుతుందన్నారు. అధిక సంరక్షణ అందించే ఈ బాండ్లను 10.50 శాతంతో ఆఫర్ చేస్తున్నామన్నారు. ఎన్‌సిడి 24 నెలలు, 36 నెలలు, 60 నెలల వ్యవధిలో అందుబాటులో ఉంటుందన్నారు.

ఘనంగా ముగిసిన సమ్మర్ క్యాంపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రజానాట్యమండలి విశాఖ జిల్లా కమిటీ, శ్రీ సాయి కళానికేతన్, రాగిణి కూచిపూడి నాట్యమండలి సంస్థల సంయుక్తాధ్వర్యాన నెల రోజుల పాటు ఎన్ఎడి కొత్త రోడ్‌లోని హమ్మీ భవనంలో జరిగిన సమ్మర్ క్యాంపు (సంగీతం, నాట్యం, శిక్షణ వేసవి శిక్షణ శిబిరం) ముగింపు వేడుకలు శుక్రవారం సాయంత్రం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఘనంగా సాగాయి. ముఖ్య అతిథులుగా ఎయు ఆర్ట్స్ అండ్ కామర్స్ కాలేజీ ప్రిన్సిపల్ నరసింహారావు, ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశభక్తి, అభ్యుదయ భావాలతో వేసవి శిక్షణ శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులోనూ ఇటువంటి శిబిరాలు, కళా ప్రదర్శనలు విస్తృతం కావాల్సి ఉందన్నారు. ప్రజానాట్యమండలి, శ్రీ సాయి కళానికేతన్ సంస్థలు చేస్తున్న కృషిని కొనియాడారు. కార్యక్రమంలో భాగంగా 'ఎగరేద్దాం తెలుగు భాష జెండా' డ్యాన్స్, దేశమును ప్రేమించుమన్నా, లుంగీ డ్యాన్స్, నెమలికి నేర్పిన నాట్యం డ్యాన్స్, పర్యావరణ పరిరక్షణ నాటిక, గురజాడ మా అడుగుజాడ డ్యాన్స్ ప్రదర్శనలు వీక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

చల్లబడ్డ వాతావరణం

హాయినిచ్చిన వర్షం
తప్పిన ఎండల ముప్పు.. ఊపిరి పీల్చుకున్న జనం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఒక్కసారిగా శనివారం నాటికి వాతావరణం చల్లబడడంతో విశాఖ నగర వాసులు ఊపిరి పీల్చుకున్నారు. నిన్నటి వరకూ నిప్పుల కుంపటి మాదిరిగా ఎండలు మండడంతో వారంతా ఉక్కిరిబిక్కిరయిన విషయం తెలిసిందే. వేడికి తోడు విద్యుత్ కోతలు ఉండటం, తాగునీటి కష్టాలు వెంటాడటంతో జనం ఇక్కట్లు వర్ణనాతీతంగా ఉండేవి. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి వాతావరణం ఒక్కసారిగా కూల్ అయిపోవడంతో జనం ఇళ్లల్లోంచి ఆ రాత్రి వేళ బయటకొచ్చి సేదతీరారు. ఒంటి గంట సమయంలో ఉరుములు, మెరుపులతో వాన కురవడంతో ఒకింత భయానికి గురైనా అంతలోనే తేరుకున్నారు. వాస్తవానికి పెద్ద శబ్దాలతో పిడుగులు పడడంతో పలుచోట్ల ప్రజల్లో భయాందోళన నెలకొంది. అలా శనివారం ఉదయం వరకూ వర్షం కురిసింది. వాతావరణంలో కొంత మేరకు మార్పు వచ్చింది.

తగ్గనున్న ఉష్ణోగ్రతలు

ప్రస్తుతం రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించడంతో పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయి. ఉష్ణోగ్రతలు సైతం శనివారం అదుపులోకి వచ్చినట్లు విశాఖపట్నం వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. పలుచోట్ల శనివారం 30 నుంచి 32 డిగ్రీలలోపే వేడి ఉంది. నైరుతి త్వరలోనే రాష్ట్రమంతటా విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది వర్షాలకు లోటు ఉండదని సంబంధిత అధికారుల నివేదికలు తెలియజేస్తున్నాయి.



వర్షంతో ఇక్కట్లు

శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకూ కురిసిన వర్షంతో పలుచోట్ల విద్యుత్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. మంచినీటికి జనం నగరంలో అవస్థలు పడ్డారు. పలుచోట్ల కరెంట్ లేక జివిఎంసి తాగునీరు అందలేదు. సాగర్‌నగర్, కెఆర్ఎం కాలనీ, అక్కయ్యపాలెం, ఎంవిపి కాలనీ, ఎండాడ, భీమిలి, మధురవాడ, పిఎం.పాలెం, మద్దిలపాలెంల్లో ఈ అవస్థలు ప్రజానీకానికి తప్పలేదు. బోరింగుల వైపు జనం శనివారం తెల్లవారు నుంచీ పరుగులు తీశారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లులో భాగంగా తాగునీటి ట్యాంకులను పలు చోట్లకు జివిఎంసి పంపినప్పటికీ అవి ఏ మూలకూ సరిపోలేదు. ప్రజలు వాటర్ సేల్స్ సెంటర్లను ఆశ్రయించి నీటిని కొనుక్కున్నారు.

యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యాన రిటైల్ ఎక్స్‌పో

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రముఖ ప్రభుత్వ రంగ బ్యాంకైన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నగరంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ భవనంలో నిర్వహించిన రిటైల్ ఎక్స్‌పోకు స్పందన లభించిందని బ్యాంకు రీజనల్ మేనేజర్ నరసింహ కుమార్ తెలిపారు. నగరంలోని ప్రముఖ బిల్డర్లు, వాహన డీలర్లు, విద్యా రుణాల ఏజెన్సీలు పాల్గొని వారి వాణిజ్య విధానాలను ప్రజలకు తెలియజేసినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా యూనియన్ బ్యాంకు జోనల్ మేనేజర్ షాలిని మీనన్, వైస్ జోనల్ మేనేజర్ శంకర్ హేమ్ రామ్, రీజనల్ మేనేజర్ నరసింహ కుమార్ పాల్గొని బ్యాంకు రిటైల్ రుణాల గురించి వివరించారు. అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రజలను కోరారు.

మామిడి పండ్ల మేళా అదుర్స్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎంవిపి.కాలనీ డబుల్ రోడ్డులోగల గిరిజన భవనంలో శనివారం ఏర్పాటు చేసిన మామిడి పండ్ల మేళాకు నగర వాసులు పోటెత్తారు. సహజ సిద్ధంగా పండించి, ముగ్గించిన వివిధ రకాల జాతుల మామిడి పండ్లను ఇక్కడ ప్రదర్శనకు, అమ్మకానికి ఉంచారు. తొలుత ఈ మేళాను ప్రకృతి వ్యవసాయదారుల సేవా సంఘం రాష్ట్ర ప్రతినిధి పిఎల్ఎన్.రాజు ప్రారంభించి మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న మామిడి రైతులను ఆదుకోవాలనే సంకల్పంతో రెండు రోజులపాటు ఈ మేళాను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే తలంపుతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. మామిడిని సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో తులసి నేచురల్స్ ప్రతినిధి సత్యన్నారాయణ, పాలెం నేచురల్స్ ప్రతినిధి చవ్వాకుల అశోక్, వ్యవసాయ శాస్త్రవేత్త అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గిరిజన భవన్‌లో మామిడి పండ్లు కొంటున్న విశాఖ నగర వాసులు



రాజవొమ్మంగి రైతు భరోసా కేంద్రానికి వచ్చిన వరి విత్తనాలు

పంపిణీకి వరి విత్తనాలు సిద్ధం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సకాలంలో సబ్సిడీపై వరి విత్తనాలు పంపిణీ సిద్ధం చేసినట్లు స్థానిక వ్యవసాయ అధికారి రమేష్ నాయుడు తెలిపారు. జడ్డంగి, రాజవొమ్మంగి రైతు భరోసా కేంద్రాలకు ఇప్పటికే ఎంటియు 1318 రకం వరి విత్తనాలు 25.2 మెట్రిక్ టన్నులు వచ్చాయన్నారు. వాటి విత్తన మొలక శాతం పరిశీలించి, రైతులకు 90 శాతం రాయితీపై అందజేస్తామన్నారు.విత్తనాలు కావలసిన రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్‌తో సంప్రదించాలని సూచించారు.

కూచిపూడి నాట్య పతాక స్వర్ణోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : డిసెంబర్ 27, 28, 29 తేదీలలో కూచిపూడి గ్రామంలో కూచిపూడి నాట్య పతాక స్వర్ణోత్సవాలను భారీ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు కళా రత్న, విశాఖపట్నం కూచిపూడి కళా కేంద్రం డైరెక్టర్ ఎబి.బాల కొండలరావు, సెంట్రల్ సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత పసుమర్తి రామలింగ శాస్త్రి తెలిపారు. శనివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో కూచిపూడి నాట్య అకాడమీ, అభినయం స్కూల్ ఫర్ డ్యాన్స్ అండ్ మ్యూజిక్ సంయుక్త ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య కళాకారుల, శిక్షకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కూచిపూడి నాట్య పతాక స్వర్ణోత్సవాల పోస్టర్, వెబ్‌సైట్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంపటి చిన సత్యం కూచిపూడి నృత్యాన్ని విశ్వవ్యాప్తం చేశారన్నారు. భారతదేశంలో పాటు అనేక దేశాలలో కూచిపూడి నృత్యం ప్రసిద్ధి చెందిందని తెలిపారు. కూచిపూడి గ్రామంలో జరిగే పతాక స్వర్ణోత్సవాల కార్యక్రమానికి పలు దేశాల నుంచి ప్రతినిధులు, గొప్ప గొప్ప నాట్య విద్వాంసులు రానున్నారని చెప్పారు. సమావేశంలో వేదాంతం వెంకట నాగ చలపతిరావు, డాక్టర్ పసుమర్తి వెంకటరమణ పాల్గొన్నారు.

సినీ గేయ రచయిత జాలాది భార్య మృతి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రముఖ తెలుగు సినీ రచయిత కీర్తిశేషులు జాలాది రాజారావు సతీమణి జాలాది ఆగ్నేశమ్మ శనివారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె విశాఖలోని సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం సుమారు 3 గంటల ప్రాంతంలో తుది శ్వాస విడిచారు. జాలాదిగా పేరుగాంచిన జాలాది రాజారావు 275 సినిమాల్లో 1500కు పైగా పాటలను రచించారు. సినీ గేయ రచయితగా ఆయన ప్రయాణంలో జాలాది ఆగ్నేశమ్మ ప్రముఖ పాత్ర పోషించారు. ఆమె మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు, అభిమానులు సంతాపం తెలియజేశారు. ఆగ్నేశమ్మ కుమార్తె డాక్టర్ జాలాది విజయ అనేక సాంస్కృతిక కార్యక్రమాలను నగరంలో నిర్వహిస్తూ గుర్తింపు పొందారు. ప్రస్తుతం విశాఖపట్నం పార్లమెంట్ స్థానం నుంచి సమాజ్ వాది పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆగ్నేశమ్మ అంత్యక్రియలు ఆదివారం జరగనున్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

75 శాతం పింఛన్ సొమ్ము పంపిణీ

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి : జిల్లాలోని 24 మండలాల్లో శనివారం 75 శాతం వరకూ పింఛన్ సొమ్మును సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. జిల్లాలో మొత్తం 2,64,526 మంది పింఛన్‌దారుల్లో ఇళ్లకు వెళ్లి అందజేయాల్సిన లబ్ధిదారులు 71,177 మంది వున్నారు. వీరికి రూ.18.99 కోట్లు ఇవ్వాల్సివుంది. 71,177 మందిలో శనివారం ఉదయం నుంచి సాయంత్రం 5.10 వరకు 53,453 మందికి (75 శాతం) రూ.14.28 కోట్లు పింఛన్ సొమ్ము అందజేశారు. అత్యధికంగా అనకాపల్లి పట్టణంలో 92 శాతం వరకు పంపిణీ చేశారు. నక్కపల్లి మండలంలో తక్కువగా 62 శాతం జరిగింది.